# విజయ ఖడ్గం

మాదుగుండు కృష్ణ

విదర్భరాజు విజయవర్మ యుద్ధంలో శత్రురాజు రఘువీరునితో భీకరంగా పోరాడుచున్నాడు. అనుకోకుండా పోరాటంలో కత్తి విరిగిపోయింది. ఆనాటి ముగింపు సమయం వరకు ఆ మొండికత్తితోనే యుద్ధం చేశాడు.

విరిగిపోయిన కత్తి చాలా పురాతనమైనది. తాతలనాటిది. బృహత్కరమైనది. పదును కలది. చాలా మంది శత్రురాజులను పరాజయంపాలు చేసినది. దానిని ఒక అడవి జాతి మనిషి తయారుచేసి ఇచ్చాడు. అతడి పేరు కొణుకుడు.

కొణుకుడికి, విజయవర్మ తాతకు మంచి స్నేహబంధం వుండేది. విజయవర్మ తండ్రి బ్రతికివున్నంత కాలం దాన్ని వాడే అవసరం రాలేదు. ఇప్పుడు ఆ మహోత్తర కత్తి లేకపోవడం వల్ల చెయ్యి విరిగినట్టైంది. వెంటనే ఇంకొక కత్తి అలాంటిది కావాలి. అందుకని ఆ రాత్రికిరాత్రే కొండలలోగల గూడెం చేరుకున్నాడు.

"కొణుకుడు మా తండ్రే అతను చనిపోయి చాలా రోజులయ్యింది. ప్రస్తుతం మాదగ్గర ఏ ఆయుధాలు లేవు" సమాధానం ఇచ్చాడు కొణుకుడి కొడుకు కొమ్మూరి.

"అయితే మరిప్పుడెలా?" రాజు ప్రశ్నించాడు.

"మీకు కావాలంటే చేసిస్తాను. విరిగిన కత్తిదానికంటే ఎక్కువ ప్రభావముండేది. అంతే కాదు. అది మీచెంత వుండేంతవరకు మీదే విజయం. కానీ అది తయారుచేయడానికి ఆరు మాసాల వ్యవధి కావాలి. దేవీ ఉపవాసంతో ఆయుధం చేసి పెడ్తాను. దానిని స్వీకరించేముందు మీరు శాంతిపూర్ణులై వుండవలెను. పొరపాటునైనా కూడా మీలో కొంచెమైనా కోపం వుండకూడదు. ఉన్న ఎడల కొంత కూడా పని చేయదు.---వుల్లిపాయలు తరగడానికి కూడా పనికిరాదు" వివరించి చెప్పాడు కొమ్మూరి.

"ప్రభావితమైన ఖడ్గం వస్తున్నప్పుడు శాంతిత్వం అలవరుచుకొనుట ఎంతపని. కత్తి నా స్వాధీనమైతే అన్య దేశాల రాజులు నాకు తలవంచక తప్పదు. కానిమ్ము. అలాగే చేసిమ్ము." అని చెప్పి సంతోషముగా వెళ్ళిపోయెను రాజు.

దారిలో రాజు ఆలోచిస్తూ వెళ్ళాడు. ఆరు నెలలలో అద్భుతమైన ఆయిధం లభించుచున్నందుకు ఆనందంగా వుంది. ఆ సంతోషంలో శత్రురాజుతో శాంతి చర్చలు జరిపి యుద్ధం విరమింప జేయాలనుకున్నాడు. అంతఃపురమునకొచ్చి అనుకున్నట్లే సంధి ఒడంబడికతో యుద్ధం నివారించాడు. అప్పటినుండే శాంతిత్వంతో మెలగసాగాడు. రాజులో కలిగిన ఆకస్మిక మార్పుకు ప్రజలు ఆశ్చర్యపోయారు.

కోపం వీడి శాంతస్వభావంతో మెలగడం చూసి అంతవరకు దూరంగావుంటున్న వారంతా దగ్గరయ్యారు. దాని దెబ్బతో అంతఃపుర అంతఃకలహాలు అంతమయ్యాయి. ఉద్యోగులు ప్రజలు ఎంతగానో సహకరిస్తున్నారు. పరిపాలనా విభాగంలో గొప్ప మార్పు సంభవించినది. పొరుగు రాజులు పాత కక్షలు మాని స్నేహంగా వుండసాగారు. రాజ్యాలనడుమ వాణిజ్యం కొనసాగింది.

ఆరుమాసాలు గడిచింది. ఇక రేపు కొమ్మూరి దగ్గరకి వెళ్ళి ఆయుధం తెచ్చుకోవాలి రాజు.

సరిగ్గా అదే రోజున రఘువీరుడు తన కుమారుని జన్మదినవేడుకలకు ముఖ్య అతిథిగా రమ్మని ఆహ్వానించాడు విజయవర్మని. అదే తగిన సమయమనుకొని గూడెం గుండా వెళ్ళాడు. కొమ్మూరిని కలిసాడు.

రాజు కత్తిని అడగటానికి వచ్చాడని వూహించి, "ఉండండి తెస్తా" నని వెళ్ళబోయాడు కొమ్మూరి.

"ఆగు కొమ్మూరి! నేనందుకు రాలేదు. దాని అవసరం నాకు లేదు. అంతకంటే పెద్ద కత్తి దొరికింది. అది నీ సలహా మేరకే" రాజు అలా అనడంతో కొమ్మూరి నివ్వెరబోయాడు. అది నా దగ్గర వున్నంత కాలం ఏ శత్రువుల దిగులు లేదు, నిర్భయంగా హాయిగా సుఖంగా ఆనందంతో స్నేహంగా వుండగలను. నేనెప్పుడిచ్చాను ఆ ఆయుధం అని ఆశ్చర్యపోతున్నావా! ఇంకా అర్థం కాలేదా! చెప్తాను విను. నీవు చిన్నవాడవైనా నీలో లోక జ్ఞానం వుంది. కత్తిని స్వీకరించేందుకు శాంతగుణం అలవర్చుకోమన్నావు. నేను ఖడ్గం నాశించే శాంతికి అలవాటు పడ్డాను. ఇప్పుడు నాకు శత్రువులు ఎవరూ లేరు. అందుకని ఆయుధంతో పని లేదు" అని వివరించాడు రాజు.

కొమ్మూరి గొప్పతనాన్ని కొనియాడాడు రాజు.

"రాజా! ఇందులో నా గొప్పతనమేమీ లేదు. అంతా మీమంచికోసమే జరిగింది. నిజం చెప్పాలంటే నాకు ఆయుధం తయారుచేయడం రాదు. సూక్ష్మంగా తప్పుకోవడంకోసమే ఆనాడు అసత్యమాడాను అంతే. అదే నేడు ఉపయోగమైనది" చెప్పి సంతోషించాడు కొమ్మూరి. "ఏది ఏమైనప్పటికి నీవు నాకు మంచి కలిగించావు. అందుకే నీకు బహుమతి ఇవ్వదలిచి వచ్చాను. కోరుకో"మ్మని చెప్పాడు రాజు.

""రాజా! మాకు కోరికలు వేరే ఏమీవుండవు. మేము గిరిజనులము. నిరు పేదలం కొండ క్రిందన గల బంజరు భూములిస్తే బాగు పడ్తాం. వ్యవసాయం చేసి బతుకుతాం" విన్నవించుకున్నాడు కొమ్మూరి. గూడెం మొత్తం రాసిచ్చాడు సంతోషంగా రాజు.